క్లుప్తంగా

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కూటమి ప్రభుత్వం విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 32వ వార్డు సుందరయ్య నగర్, గంగావతి నగర్, 30వ వార్డు శరీన్‌నగర్ స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని ఇంటింటికి స్టిక్కర్లు అతికించారు. సుధాకరప్ప మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలకొట్టమని చెప్పిన విషయం గుర్తు చేశారు. అలాంటి వారు అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో యేసు, రామాంజనేయులు, సురేష్, నాగప్ప, లక్ష్మిదేవి, దావిదు, శిరోమణి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఏఎస్పీ



పాఠశాల మైదానాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ జావళి

పాణ్యం : ఈనెల 17న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాణ్యం పర్యటన సందర్భంగా అధికారులు ఏర్పాటు పరిశీలించారు. నంద్యాల ఏఎస్పీ జావళి ఆధ్వర్యంలో సభ నిర్వహించే మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సభకు రాకపోకలు, వాహన శ్రేణి మైదానాన్ని చేరుకునేలా ఏర్పాట్లపై ఆరా తీశారు. అలాగే హెలిప్యాడ్ ప్రదేశం ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు.

నర్సుల సేవలు అమూల్యం

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రుల్లో రోగులకు నర్సులు అందించే సేవలు అమూల్యమైనవని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో చేరిన రోగులు జాగ్రత్తగా ఇంటికి వెళ్లే వరకు కంటికి రెప్పలా కాపాడే వారే నర్సులన్నారు. ఉన్నత విలువలతో వారికి వైద్యసేవలు అందించే మాతృమూర్తులని కొనియాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సైనికుల ప్రాణాలను కాపాడేందుకు అహోరాత్రులు శ్రమించి వైద్యసేవలు అందించిన స్ఫూర్తి ప్రదాత ఫ్లోరెన్స్ నైటింగేల్ అని, ఆమెను నేటి తరం నర్సులు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. ఏపీ ఎన్జీటస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ.కాశన్న, ఎం.రామకృష్ణ, నాయకులు షమీవుల్లా, ప్రభాకర్‌రెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, చిరంజీవి, జనార్దన్‌రెడ్డి, శంకర్ నాయక్, శాంతిభవాని, నర్సింగ్ సూపరింటెండెంట్లు సావిత్రిబాయి, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ఆన్‌లైన్ భగవద్గీత తరగతులు

కర్నూలు కల్చరల్: లర్న్ గీత సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి భగవద్గీత ఉచిత ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 20 రోజుల్లో 2 అధ్యాయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పఠన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి గీతా గుంజన్ ఇ-ప్రశస్తి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. వారానికి 5 రోజుల పాటు రోజూ 40 నిమిషాల చొప్పున 21 టైమ్ స్లాట్‌లలో శిక్షణ ఉంటుందని వివరించారు. ఎంపిక చేసిన 13 భాషల్లో ఇష్టమైన భాషలో శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు http://joingeeta.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 1800-203-6500ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సీహెచ్‌ఓలను బెదిరించడం సరికాదు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రవ్యాప్తంగా రెండు వారాలుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న సీహెచ్‌ఓలను బాధ్యత గల మంత్రి హోదాలో ఉన్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. కర్నూలులోని ధర్నా చౌక్‌లో సీహెచ్‌ఓలు చేస్తున్న ఆందోళన సోమవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు ర్యాలీ నిర్వహించి రాజ్‌విహార్ వద్ద మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. వీరికి ఏఐటీయూసీ మద్దతు తెలిపింది.ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు చందన, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్రప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బీఆర్ రెడ్డి కాలనీలో రోడ్డుపై గుంతలు



లక్ష్మీపురం రోడ్డు దుస్థితి

కల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో రోడ్లు బాగు చేస్తామని ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి ఊదరగొట్టారు. అయితే అధికారం చేపట్టి పదకొండు నెలలు గడిచినా రోడ్లు ఎక్కడ వేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కర్నూలు నగరంలో 52 వార్డులు సుమారుగా 6.5 లక్షల జనాభా ఉన్నారు. ఇందులో 16 వార్డులు పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తోంది. 16 వార్డుల నుంచి ప్రజలు మున్సిపాలిటీకి వివిధ రకాల పన్నులు చెల్లిస్తున్నారు. అయితే ఆయా కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

– 44వ జాతీయ రహదారి నుంచి కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే రోడ్డు అడుగుకో గుంత అన్నట్లుగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాల ప్రజలు, వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తుంటారు. ఈ దారి వెంట ప్రయాణించాలంటే నరక ప్రాయంగా ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– బీఆర్ రెడ్డి కాలనీ, 37, 41వ వార్డులోని వీకర్ సెక్షన్ కాలనీలో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ కాలనీలో ఎక్కువ శాతం మధ్య తరగతికి చెందిన ప్రజలు నివాసం ఉంటున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో పాటు రోడ్డు మధ్యలో నెర్రలు ఇచ్చాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీ వాసులు వాపోతున్నారు.

రోడ్డును బాగు చేయండి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు, కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. దారంతా గుంతలమయంగా మారింది. సుమారుగా పది నెలలు అవుతున్నా రోడ్డు గురించి పట్టించుకోవడం లేదు. రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. అధికారులు స్పందించి 44వ జాతీయ రహదారి నుంచి లక్ష్మీపురం వరకు రోడ్డును నిర్మించాలి.

– ఇప్పల శేషారెడ్డి, లక్ష్మీపురం

మౌలిక వసతులు కల్పించాలి



కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలో రోడ్లు సరిగా లేవు. మెయిన్ రోడ్డు అధ్వానంగా మారింది. బీఆర్ రెడ్డి కాలనీలో మున్సిపల్ అధికారులు మౌలిక వసతులు కల్పించడం లేదు. తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ సక్రమంగా లేదు. అధికారులు స్పందించి కాలనీలో సమస్యలను పరిష్కరించాలి.

– ఎన్.రవిచంద్ర, బీఆర్ రెడ్డి కాలనీ

ఘనంగా మల్లెందొడ్డి స్వామి పల్లకోత్సవం



గొల్లలదొడ్డికి చేరిన మల్లందొడ్డి స్వామి పల్లకి

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో మల్లందొడ్డి స్వాముల వారి దేవర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామంలో వెలసిన మల్లందొడ్డి స్వాముల వారి మూడు రోజుల దేవర కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సోమవారం స్వామి వారి పల్లకోత్సవంను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గంగా పూజ అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తిని తుంగభద్ర నది నుంచి పల్లకీలో గ్రామానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సాంప్రదాయ వాయిద్యాలతో స్వామివారి పల్లకీకి స్వాగతం పలికారు. గ్రామంలో ఊరేగింపు అనంతరం భక్తుల దర్శనార్థం గ్రామంలోని లింగాలయ ఆలయంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

వీఆర్‌ఏలకు కనీస వేతనమివ్వాలి



తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

కోడుమూరు రూరల్: వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జీపీ వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం అమలు చేయడంతో పాటు, పనిభారం తగ్గించాలని కోరుతూ సోమవారం మండలంలోని వీఆర్‌ఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కనీస వేతనం లేక వీఆర్‌ఏలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వీఆర్‌ఏలకు కనీస వేతనమివ్వడంతో పాటు, డీఏను జీతాల్లో కలపాలని, నైట్ డ్యూటీలను రద్దు చేయాలని, అర్హులైన వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలని, ప్రమాదంలో మరణించిన వీఆర్‌ఏలకు రూ.10 లక్షలు చెల్లించాలని ఆయన కోరారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, వీఆర్‌ఏ సంఘాల నాయకులు కుమార్, యుగంధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని గ్రూప్ దేవాలయాల భూములకు సంబంధించి సోమవారం ఆంజనేయస్వామి ఆలయంలో దేవదాయ స్పెషల్ అధికారి గోపి ఆధ్వర్యంలో ఈఓ సువర్ణ అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. 51మంది డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. ఇందులో రామస్వామి ఆలయ భూమి 29.96 ఎకరాలు ఈ ఏడాది రూ.2,57,000 పాడగా, గతేడాది రూ.1,41,000 వచ్చినట్లు తెలిపారు. దీంతో ఆదాయం రూ. 1.16.000 వచ్చిందన్నారు. వీరనారాయణస్వామి ఆలయం 28.27ఎకరాలకు ఈ ఏడాది రూ. 2,89,500 పలుకగా.. గతేడాది రూ. 1,97,000 వచ్చిందని దీంతో రూ.92,500 అదనపు ఆదాయం సమకురినట్లు వెల్లడించారు. పాణికేశ్వర స్వామి 41.52 ఎకరాలు గతేడాది రూ.1,69,000 రాగా ఈ ఏడాది రూ.1,86,500 పాడగా రూ.17,500 ఆదాయం వచ్చిందన్నారు. సత్యనారాయణస్వామి ఆలయానికి సంబంధించి 1.52ఎకరాలకు భూమి రూ.10,200 పాడగా గతంలో రూ.4,700 పలికిందన్నారు. ఈ ఏడాది రూ. 5500లు ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. పడవెంకటాద్రి ఆలయానికి సంబంధించి 9.19ఎకరాలు ఈరోజు రూ.1,22,000 పాడగా గతంలో రూ. 61,500 పలికిందని, దీంతో రూ.60,500 అదనపు ఆదాయం సమకురినట్లు తెలిపారు. మొత్తం గ్రూప్ దేవాలయానికు సంబంధించి 110.46ఎకరాలకు ఈ ఏడాది రూ. 2,92,000 అదనపు ఆదాయం వచ్చిందని ఈఓ సువర్ణ తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు



విజేత వృషభాల యజమానులకు నగదు బహుమతులను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహ స్వామి రథోత్సవం పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం వివిధ జిల్లాలకు చెందిన 7 జతల వృషభరాజములు పోటీ పడగా, కోడుమూరు మండలంలోని గద్వాల జిల్లా కంచుపాడుకు చెందిన ఆంజనేయరెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో రాతి దూళాన్ని 5700 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచాయి. అలాగే కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన శశాంక్, శ్రేయ వృషభాలు (5652 అడుగులు) 2వ స్థానం, దైవందిన్నె, ఈడిగోనిపల్లెకు చెందిన లక్ష్మినరసింహ, వంశీకృష్ణ వృషభాలు (4800 అడుగులు) 3వ స్థానం, మండలంలోని ప్యాలకుర్తికి చెందిన జాకీర్‌హుసేన్ వృషభాలు (4349 అడుగులు) 4వ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున బహుమతులను దాతల సహకారంతో నిర్వాహకులు పూజారి రంగన్న స్వామి అందజేశారు. కృష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సురేంద్రరెడ్డి, గ్రామ పెద్దలు, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.



కల్లూరులో నోరు తెరచిన మ్యాన్ హోల్స్

ఆదమరిస్తే అంతే!

కల్లూరు: కల్లూరులోని 44వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకు అనుకున్న ఉన్న కల్లూరు ప్రధాన రోడ్డులో రెండు మ్యాన్ హోల్స్ ఉన్నాయి. రెండు మ్యాన్ హోల్స్‌పై మూతలు లేవు. ముందున్న మ్యాన్ హోల్‌ను గుర్తించడానికి చిన్నపాటి రాయిని ఉంచారు. రోడ్డుపై నిత్యం ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తిరుగుతుంటారు. రాత్రి సమయంలో ప్రయాణికులు ఆదమరిచారంటే మ్యాన్ హోల్‌లో పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్ హోల్స్‌పై మూతలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

దేశ భక్తి కలిగి ఉండాలి



భరత మాతకు పాలాభిషేకం చేస్తున్న రచయిత్రులు

కర్నూలు కల్చరల్: చదువుతోపాటు చిన్న తనం నుంచే పిల్లల్లో దేశభక్తిని నేర్పాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జై జవాన్ కల్చరల్ ఫెస్టివల్‌లో భాగంగా మూడో రోజు సోమవారం దేశ భక్తి నృత్య ప్రదర్శనలు, గేయాల ఆలాపన జరిగింది. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం సభ్యులు భరత మాత చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన కవయిత్రుల సమ్మేళనం అలరించింది. గాయకురాలు సుజాత ఆలపించిన దేశ భక్తి గీతాలు, కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు దేశభక్తిని రగిల్చాయి.

పీజీఆర్‌ఎస్ అర్జీలు పరిష్కరించండి



సి.బెళగల్‌లో అర్జీ తీసుకుంటున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: మండల ప్రజల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్‌ఎస్‌కు) వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణదొడ్డి, పోలకల్, సి.బెళగల్ తదితర గ్రామాల నుంచి రైతులు తమ భూ సమస్యలు, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అర్జీలు ఇచ్చారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ అర్జీల సమస్యలపై మండల అధికారులతో చర్చించి, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచనలు చేశారు. ఆయా శాఖల మండల అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైభవోపేతం.. చెన్నకేశవుని రథోత్సవం



ఓర్వకల్లులో భక్తజన సందోహం మధ్య స్వాముల వారి రథోత్సవం

ఓర్వకల్లు : మండల కేంద్రం ఓర్వకల్లు, శకునాల గ్రామాల్లో వెలసిన చెన్నకేశవుని రథోత్సవం సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితతో పాటు స్థానిక నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవాన్ని ప్రారంభించారు. శకునాలలో ఆలయ పురోహితులు మనోహర్‌శర్మ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, రథోత్సవానికి సిద్ధం చేశారు. దేవస్థానం నుంచి బసవేశ్వరస్వామి గుడి వద్దకు రథాన్ని లాగి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, పండ్లు రథంపైకి విసురుతూ, స్వాముల వారి ఆశీస్సులు పొందారు.

కల్యాణోత్సంలో పాల్గొన్న కాటసాని

శకునాల గ్రామంలో తెల్లవారు జామున నిర్వహించిన స్వాముల వారి కల్యాణోత్సంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీదేవి, భూదేవి సమేత, చెన్నకేశవస్వామి తిరునాల సందర్భంగా నిర్వహించిన స్వాముల వారి కల్యాణాన్ని కనులారా వీక్షించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు బీరం రాంపుల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎద్దుల.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కాటసానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు మనోహర్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆలయ మర్యాదలతో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జనార్దన్‌నాయుడు, శ్రీకాంత్, జనార్దన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లులో అశేష జనవాహిని మధ్య రథోత్సవం

మండల కేంద్రంలో ఉత్సవ మూర్తులను గర్భగుడి నుంచి పల్లకీలో ఆశీనులనుగావించి రథశాల వద్దకు చేర్చారు. ఆలయ అర్చకులు నారాయణరావు, విష్ణుశర్మలు రథాంగబలి, కుష్మాండకాండ నిర్వహించి, రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అశేష సందోహాల మధ్య తరలి పోతున్న రథంపైకి భక్తులు పూలు, పండ్లు చల్లుతూ, స్వాముల వారిని కనులారా వీక్షించారు. రథశాల నుంచి స్థానిక బసవేశ్వరస్వామి వరకు లాగి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన చెక్కభజన, డప్పులు, మంగళవాయిద్యాలు బాణసంచా పేలుళ్లతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకకుండా ఎస్‌ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవింద రెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, మౌలీశ్వరరెడ్డి, హరికృష్ణగౌడు, వెంకటరామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... చెన్న కేశవ స్వామి కళ్యాణం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని శ్రీ చెన్నకేశవ స్వామివారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ సిబ్బంది పట్టు వస్త్రాలను సమర్పించారు. పురోహితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన శ్రీదేవి భూదేవి లక్ష్మీ , చెన్నకేశవ స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ ప్రధానార్చకులు హేమ కేశవయ్య అందించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



శకునాలలో కాటసానిని సన్మానిస్తున్న ఆలయ అర్చకులు మనోహర్‌శర్మ



గడివేములలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రూరల్): కర్నూలు మండల పరిధిలోని కౌలు రైతులు గుర్తింపు కార్డుల (సీసీఆర్‌సీ) కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రూఫస్ రొనాల్డ్ సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ..ఈ ఏడాది మండలంలో 1350 కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసేందుకు అధికారులు ఆదేశించారన్నారు. భూయాజమాని హక్కులకు భంగం కలగకుండా 11 నెలల కాలపరిమితితో గుర్తింపు కార్డులను జారీ చేస్తారని తెలిపారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు భూయజామని పొలం పాస్ బుక్, 1బీ కాపీ, ఆధార్ కార్డు, కౌలు రైతు ఆధార్ కార్డు, ఫొటోలు, ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి కౌలుకు ఇచ్చారో వంటి వివరాలు నమోదు చేస్తూ యజమాని అంగీకరిస్తూ సంతకం చేసిన ధ్రువపత్రాన్ని వీఆర్ఓకు అందజేస్తే గుర్తింపు కార్డు జారీ చేస్తారని వివరించారు. గుర్తింపు కార్డులు పొందడం ద్వారా కౌలు రైతులు ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులవుతారని వెల్లడించారు.

17 నుంచి ఉచిత శిక్షణ తరగతులు

కర్నూలు కల్చరల్: హైదరాబాద్ ఇన్‌కంట్యాక్స్ అడిషనల్ కమిషనర్ ఐఆర్‌ఎస్ బి.యాదగిరి ఆధ్వర్యంలో అమీలియో హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ లక్ష్మీప్రసాద్ చాపే నిర్వహణలో ఈనెల 17వ తేదీ నుంచి వివిధ అంశాలపై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్, ఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, ఆర్గనైజింగ్ చైర్మన్ పి.దీక్షిత్ పేర్కొన్నారు. ఎన్ఆర్ పేటలోని శ్రీలక్ష్మీ పాఠశాలలో జూన్ 6వ తేదీ వరకు 21 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. శిక్షణలో పాల్గొనేవారికి ఉచిత స్టడీ మెటీరియల్ ఇవ్వడంతో పాటు మధ్యాహ్నం భోజన వసతి, దూర ప్రాంతాల వారికి ఉచిత హాస్టల్ వసతి ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 91777 64147, 96409 69891 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



గుంతలు పడి కంకర తేలిన రోడ్డు



రోడ్డుపై గుంతలు పడిన దృశ్యం

రోడ్డు గుంతలమయం

కర్నూలు(రూరల్): మండల పరిధిలో గార్గేయపురం నుంచి దిగువపాడు వెళ్లే రోడ్డు గుంతలు పడి, రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణంచే వాహనదారులు నిత్యం ఇబ్బందులు పాడుతున్నారు. దిగువపాడు మిదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, నంద్యాల జిల్లా మిడ్తురు మండలానికి రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డుపై రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురివుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారిని బాగుచేయాలని కోరుతున్నారు.

ముళ్లపొదలతో మూసుకుపోయిన బొల్లవరం రస్తా



మూసుకుపోయిన రహదారి

గడివేముల: మండల కేంద్రం గడివేముల నుంచి బొల్లవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ముళ్ల చెట్లతో మూసుకుపోయింది. కంపచెట్లు, పిచ్చి మొక్కలు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రహదారిలో వెళ్లాలంటే భయంగా ఉంటుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముళ్ల కంపల వల్ల ఎదురుగా వచ్చే వహనాలు కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ప్రయాణం సురక్షితంగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.